సాక్షి విశాఖపట్నం

శనివారం । 4 । అక్టోబర్ । 2025



దసరా ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని అనకాపల్లిలో నూకాంబిక అమ్మవారిని గురువారం విశాఖ జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ దర్శించుకున్నారు.



ఆకట్టుకున్న సత్య హరిశ్చంద్ర పద్యనాటకం 10లో

ప్రై'వేటు' వేయడమే చంద్రబాబు విధానం

- వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ కన్నబాబు వెల్లడి



భీమబోయినపాలెంలో మెడికల్ కళాశాలను సందర్శించిన ఎమ్మెల్సీ తలశిల రఘురాం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి, విశాఖ జిల్లాల అధ్యక్షులు అమర్‌నాథ్, కేకే రాజు తదితరులు

సాక్షి, అనకాపల్లి: ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుకు ధారాదత్తం చేయడమే నారా వారి పాలనంటూ వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు ధ్వజమెత్తారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. వీటిలో 5 మెడికల్ కళాశాలలు పూర్తికాగా.. మిగిలినవి సగానికి పైగా నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత నిర్మాణాలను కొనసాగించకపోగా.. వాటిని ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేందుకు అన్ని కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. ఈ నెల 9వ తేదీన మాకవరపాలెం మండలంలో గల భీమబోయినపాలెంలో మధ్యలో నిర్మాణం నిలిపివేసిన ప్రభుత్వం మెడికల్ కళాశాలను మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందర్శించనున్నారన్నారు. మాజీ సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం శుక్రవారం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు. కురసాల కన్నబాబుతోపాటు మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, విశాఖ, , అనకాపల్లి, విజయనగరం జిల్లాల పార్టీ అధ్యక్షులు వరుసగా కేకే రాజు, గుడివాడ అమర్‌నాథ్, మజ్జి శ్రీనివాసరావు, అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అనకాపల్లి వెళ్లి అక్కడి పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు.

మధురవాడ-రేవళ్లపాలెం భూ వ్యవహారంలో

కొత్త చిక్కు



- అక్రమ రిజిస్ట్రేషన్ల రద్దుకు నిరాకరణ
- కేసు నమోదైనా వెనక్కి తగ్గని వైనం
- వారు ఒప్పుకోకపోతే రిజిస్ట్రేషన్ రద్దు లేనట్లే
- భారీ మొత్తం కావాలంటూ డిమాండ్
- కాపులుప్పాడలోనూ అక్రమ రిజిస్ట్రేషన్‌కు మరో ముఠా యత్నం
- ఆటోమేటిక్ మ్యూటేషన్‌తో అదనపు ఇబ్బందులు
- తహసీల్దారు సహకరించారనే ఆరోపణలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నా, ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయడానికి ఆక్రమణదారులు అంగీకరించకపోతే చట్టపరంగా అవకాశం లేకపోవడం విశాఖలోని మధురవాడ-రేవళ్లపాలెం భూ వ్యవహారంలో కొత్త చిక్కును సృష్టించింది. ఈ కేసులో నిందితులు జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత కూడా రిజిస్ట్రేషన్ రద్దుకు అంగీకరించకుండా, అసలు యజమానులను భారీ మొత్తం డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం. దీంతో రిజిస్ట్రేషన్ రద్దు ప్రక్రియ ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో అసలు యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో కీలక పాత్ర పోషించిన ఒక డాక్యుమెంట్ రైటర్‌పై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా మిన్నకుండిపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు మధురవాడ తరహాలోనే **కాపులుప్పాడలోనూ కోట్లలో విలువ చేసే రెండు ప్లాట్లను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు మరో ముఠా ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. మధురవాడ భూమి ఇప్పటికే అక్రమ రిజిస్ట్రేషన్ దారుల పేరు మీద ఉండటంతో, ఇలాంటి అక్రమ రిజిస్ట్రేషన్ల దందా విశాఖలో రోజురోజుకు పెరు**గుతోందని తెలుస్తోంది. ప్రభుత్వం ఇటీవల కార్పొరేషన్ పరిధిలోనూ ఆటోమేటిక్ మ్యుటేషన్ విధానాన్ని అమలు చేస్తుండటంతో, ఇటువంటి అక్రమ రిజిస్ట్రేషన్ల కారణంగా అసలు భూ యజమానులు భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

వ్యవహారం నడిచిందిలా...!

మధురవాడలోని సర్వే నంబరు 203/14ఏ పార్టులో ఉన్న బ్యాంక్ ఆఫీసర్స్ హౌసింగ్ లే-అవుట్‌లో కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన ఆర్ఎస్ఎస్ ప్రకాశరావు సహా కొందరు 300 గజాల చొప్పున ప్లాట్లను కొనుగోలు చేశారు. యజమానుల్లో కొందరు మరణించడం, మరికొందరు విదేశాల్లో ఉండటాన్ని అవకాశంగా తీసుకుని, రేవళ్లపాలెంకు చెందిన బెవర అనిల్‌కుమార్, వెంకటేష్ , శ్రీకాకుళం జిల్లాకు చెందిన పగోటి దిలీప్‌కుమార్ తదితరులు తప్పుడు డాక్యుమెంట్లను సృష్టించారు.వారు తప్పుడు అడంగల్, ఎఫ్ఎంబీలను సృష్టించి, తమ తాతల నుంచి వచ్చిన స్థలంగా పేర్కొన్నారు.1572.66 గజాల స్థలానికి మొదట జీపీఏ (జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ) చేసుకుని, దాని ఆధారంగా కాకినాడకు చెందిన ఉసిరికాల రాజా రామ పద్మజ పేరిట రిజిస్ట్రేషన్ (దస్తావేజు నెంబరు 5585/2025) చేయించుకున్నారు. రిజిస్ట్రేషన్ పత్రాలలో రూ.3.97 కోట్లు చెల్లించినట్టు పేర్కొన్నారు.తన స్థలంలో దౌర్జన్యంగా ఫెన్సింగ్ వేయడానికి ప్రయత్నిస్తున్నారని ప్రకాశ్‌రావు పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ మోసం బయటపడింది. పోలీసులు అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించుకున్న ముఠాపై కేసు నమోదు చేసి జైలుకు కూడా పంపారు.

రిజిస్ట్రేషన్ రద్దుకు ససేమిరా

జైలు నుంచి తిరిగి వచ్చిన తర్వాత, అక్రమ రిజిస్ట్రేషన్‌దారులు రిజిస్ట్రేషన్ రద్దు చేయడానికి అంగీకరించడం లేదు. వారు అంగీకరిస్తేనే తప్ప చట్టపరంగా రద్దుకు అవకాశం లేకపోవడంతో, ఇప్పుడు తమకు భారీ మొత్తం చెల్లించాలంటూ అసలు యజమానులను డిమాండ్ చేస్తున్నట్టు తెలుస్తోంది. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మధురవాడ ప్రాంతంలోని ఈ స్థలం విలువ రిజిస్ట్రేషన్ శాఖ వారి లెక్కల ప్రకారమే గజం విలువ రూ. 50 వేల మేర ఉంది. అంటే మొత్తం 1572.66 గజాలు అంటే.... గజానికి రూ. 50 వేల చొప్పున లెక్కిస్తే మొత్తం రూ. 7.86 కోట్లు అవుతుంది. ఇక మార్కెట్ విలువ ప్రకారం ఈ స్థలం ఖరీదు రూ. 12 కోట్లకుపైగానే ఉంటుందని తెలుస్తోంది. ఈ అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో కూటమి పార్టీ ఎమ్మెల్యే ఉండటంతోఅక్రమ రిజిస్ట్రేషన్ దారులు కూడా భారీ మొత్తం డిమాండ్ చేస్తున్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కాపులుప్పాడపై కన్ను....!

ఇక కాపులుప్పాడలోని మరో స్థలంపై కూడా మరో అక్రమ ముఠా కన్నేసినట్టు తెలుస్తోంది. కాపులుప్పాడ లోని 350/8, 350/12 సర్వే నంబర్లలోని రెండు ప్లాట్లను కూడా ఇదే తరహాలో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు యత్నిస్తున్నట్టు సమాచారం. ఇందుకుగానూ స్థానిక తహసీల్దారు సహకరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ భూకబ్జా ముఠాకు అనుకూలంగా ఒక సర్టిఫికెట్‌ను తహసీల్దారు జారీ చేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ పత్రం ఆధారంగా ప్లాట్లను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలున్నాయి. మరోవైపు ఈ అక్రమ భూ రిజిస్ట్రేషన్ వ్యవహారంలోనూ సదరు డాక్యుమెంట్ రైటర్ ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. కూటమి ఎమ్మెల్యే అండదండలతోనే సదరు డాక్యుమెంట్ రైటర్ వ్యవహరిస్తుండటంతో స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు కూడా సదరు వ్యక్తిని దూరంగా ఉంచేందుకు జంకుతున్నారనే విమర్శలున్నాయి. వాస్తవానికి గతంలోనూ మధురవాడలో ఇదే తరహాలో అక్రమ రిజిస్ట్రేషన్ జరగగా... భారీ మొత్తం తీసుకున్న తర్వాతే రిజిస్ట్రేషన్ రద్దుకు ముందుకొచ్చినట్టు తెలుస్తోంది.

వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యులుగా కోలా గురువులు, కాయల వెంకటరెడ్డి



కోలా గురువులు



కాయల వెంకట రెడ్డి

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా నుంచి ఇద్దర్ని ఆ పార్టీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్లుగా, 14 మందిని స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమించారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్స్‌గా కోలా గురువులు (విశాఖ సౌత్), కాయల వెంకట రెడ్డి (విశాఖ నార్త్) నియమించారు.

స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర'లో జిల్లాకు 7 అవార్డులు

మహారాణిపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో నిర్వహించిన 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ అంధ్ర 2025' కార్యక్రమంలో జిల్లాకు 7 రాష్ట్ర స్థాయి , 44 జిల్లా స్థాయి అవార్డులు లభించడం సంతోషదాయకమని కలెక్టర్ హరేందిర ప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ ఈ అవార్డులను ప్రకటించారు. రాష్ట్రంలో 42 విభాగాలలో ప్రకటించిన అవార్డులలో, జీవీఎంసీకి స్వచ్ఛ సర్వేక్షన్ కేటగిరి అవార్డుతో పాటు, సింహగిరి కాలనీ మహిళా సంఘం, గోరపల్లి గ్రామ సమాఖ్య, నడుపూరు జెడ్పీ హైస్కూల్, ఎంవీపీ రైతు బజార్, లోటస్ వైర్‌లెస్ టెక్నాలజీ, తిరుమల నగర్ రెసిడెన్షియల్ కాలనీలకు రాష్ట్ర స్థాయి అవార్డులు దక్కాయి. జిల్లా స్థాయిలో 44 అవార్డులు వచ్చాయని, వీటిలో ఉత్తమ గ్రామ పంచాయతీలు, ఎస్ఎల్ఎఫ్, బస్ స్టేషన్, ఎన్జీవో, హాస్పిటల్స్, పాఠశాలలు, అంగన్‌వాడీలు, ప్రభుత్వ కార్యా లయాలు, పరిశ్రమలు, హాస్టల్స్, శానిటేషన్ వర్కర్స్, గ్రీన్ అంబాసిడర్స్ వంటి పలు కేటగిరీలలో విజేతలు ఉన్నారని కలెక్టర్ తెలిపారు. ఈ నెల 6న ఇన్‌చార్జి మంత్రి చేతుల మీదుగా అవార్డుల ప్రదానం జరుగుతుందని తెలిపారు.

వృత్తి సవాళ్లపై అవగాహన ఉండాలి

- ఆర్‌జేడీ విజయభాస్కర్
- డీఎస్సీ-2025 నూతన ఉపాధ్యాయులకు శిక్షణ




మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయ భాస్కర్

సబ్బవరం: వృత్తిలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడంతో పాటు, విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దే అంశాలపై ఉపాధ్యాయులకు పూర్తి అవగాహన ఉండాలని ఆర్‌జేడీ విజయభాస్కర్ శుక్రవారం తెలిపారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో డీఎస్సీ-2025లో ఎంపికైన నూతన ఉపాధ్యాయులందరికీ శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. విశాఖ ఉమ్మడి జిల్లాకు చెందిన కొత్త ఉపాధ్యాయులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్‌లు అందజేయడంతో పాటు, వృత్తిపరమైన అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈ 8 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆర్‌జేడీ విజయభాస్కర్ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణను ఉపాధ్యాయులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పనిచేసే గ్రామానికి మంచి పేరు తీసుకురావడంతో పాటు, విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి జి. అప్పారావు నాయుడు, ఉప విద్యాశాఖాధికారి అప్పారావు, అకడమిక్ మానిటరింగ్ అధికారి కెజియా పాల్గొన్నారు.

మధురవాడలో..

మధురవాడ: కొత్తగా విధుల్లో చేరబోతున్న ఉపాధ్యాయులు తాము పొందుతున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్ సూచించారు. మధురవాడ ఐటీ సెజ్‌లో శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని 360 మంది ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డీఈవో ప్రేమకుమార్, భీమిలి డైట్ ప్రిన్సిపాల్ ఎల్. సుధాకర్ పాల్గొన్నారు.

నగర సుందరీకరణ పనులు సత్వరం పూర్తి చేయండి



పనులు పర్యవేక్షిస్తూ..పలు సూచనలు ఇస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

డాబాగార్డెన్స్: నగరంలో జరగనున్న పార్టనర్ షిప్ సమ్మిట్‌కు ముందు నగరాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దే పనులను త్వరగా పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. దేశ విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు రానున్నందున, నగరాన్ని మరింత సుందరంగా మార్చాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం కమిషనర్ కేతన్ గార్గ్, ప్రధాన ఇంజనీర్ సత్యనారాయణరాజు, ఇతర అధికారులతో కలిసి ఆర్కే బీచ్, పార్క్ హోటల్, సిరిపురం వంటి ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆర్కే బీచ్ వద్ద డ్రోన్ కెమెరా ద్వారా పలు ప్రాంతాలను పరిశీలించి, అభివృద్ధి పనులపై ఇంజనీర్‌కు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా బీచ్‌రోడ్డులో చేపట్టాల్సిన సుందరీకరణ పనులను కమిషనర్ వివరించారు. వీటిలో ముఖ్యంగా ఫుట్‌పాత్ కర్బ్ వాల్స్ మరమ్మతులు, పెయింటింగ్‌లు, స్టడ్స్ ఏర్పాటు పనులు సత్వరం పూర్తి చేయాలన్నారు. మొక్కల ఏర్పాటు, విద్యుత్ అలంకరణ, వీధిలైట్ల మరమ్మతులు వెంటనే చేయాలని ఆదేశించారు. సమ్మిట్ పూర్తయ్యే వరకు జీవీఎంసీ అధికారులు, సంబంధిత విభాగాలు సమన్వయంతో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ మేరకు తరచూ సమన్వయ సమావేశాలు నిర్వహించి పనులను పర్యవేక్షించాలని ప్రధాన ఇంజనీర్‌కు సూచించారు. పర్యటనలో జోనల్ కమిషనర్లు కె.శివప్రసాద్, మల్లయ్యానాయుడు, పర్యవేక్షక ఇంజినీర్లు సంపత్‌కుమార్, కె.శ్రీనివాసరావు, రాయల్ బాబు, పాల్గొన్నారు.

'బ్లూ ఫ్లాగ్' గుర్తింపు అపహాస్యం

- రుషికొండ బీచ్...నిర్వహణ గాలికి
- అడుగడుగునా అధికారుల అలసత్వం
- బీచ్‌లో సంచరిస్తున్న పశువులు, కుక్కలు
- ఆందోళన చెందుతున్న పర్యాటకులు
- చిన్నపాటి వర్షానికి నీట మునుగుతున్న చిల్డ్రన్స్ పార్కు



రుషికొండ బీచ్ వద్ద డంప్ చేసిన డెబ్రిస్



చిన్నపాటి వర్షానికి నీట మునిగిన చిల్డ్రన్స్ పార్కు



బీచ్‌లో సంచరిస్తున్న పశువులు



బీచ్‌లో సంచరిస్తున్న కుక్క

కొమ్మాది: రాష్ట్రంలోనే ఏకైక అంతర్జాతీయ గుర్తింపు పొందిన (బ్లూ ఫ్లాగ్) రుషికొండ బీచ్ నిర్వహణ లోపంతో 'పేరు గొప్ప... ఊరు దిబ్బ' అన్న చందంగా మారింది. దేశ విదేశాల నుంచి నిత్యం వందలాది పర్యాటకులు సందర్శించే ఈ బీచ్‌లో కనీస సౌకర్యాల కల్పనలో పర్యాటక శాఖ, బ్లూ ఫ్లాగ్, జీవీఎంసీ అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారని పర్యాటకులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అడుగడుగునా అవస్థలు, అధికారుల అలసత్వం

గతంలో నిర్వహణ సరిగా లేక బ్లూ ఫ్లాగ్ గుర్తింపును కోల్పోయినా, మళ్లీ ఆ గుర్తింపును సాధించుకున్న తర్వాత కూడా అధికారుల్లో ఎటువంటి మార్పూ కనిపించడం లేదు. బీచ్ ప్రాంతంలో పశువులు, కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతుండడంతో పర్యాటకులు భయాందోళన చెందుతున్నారు. కుక్కల బెడద మరీ ఎక్కువగా ఉన్నా, అధికారులు ఫిర్యాదులను పట్టించుకోవడం లేదు. సుందరమైన బీచ్ సమీపంలో పెద్ద ఎత్తున నిర్మాణ వ్యర్థాలు (డెబ్రీస్) వేయడం వల్ల ఈ ప్రాంతం కళావిహీనంగా కనిపిస్తోంది.

చిల్డ్రన్స్ పార్కు దయనీయం : బీచ్ వద్ద ఉన్న చిల్డ్రన్స్ పార్కు చిన్న వర్షానికే నీట మునుగుతోంది, దీంతో ఆడుకోవడానికి వచ్చిన చిన్నారులు నిరాశగా వెనుతిరుగుతున్నారు. తీరం వెంబడి ఉన్న వ్యాపారులు వ్యర్థాలను బీచ్ వద్దే వదిలివేయడం పర్యాటకులకు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల అలసత్వం

అంతర్జాతీయ గుర్తింపు పొందిన బీచ్‌లో ఇలాంటి పరిస్థితులు ఉండటంపై పర్యాటకుల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అధికారుల మధ్య సమన్వయ లోపమా లేక అలసత్వమా అనే ప్రశ్న తలెత్తుతోంది. గతంలో సాక్షాత్తూ కలెక్టర్ హెచ్చరించినా అధికారుల్లో చలనం లేకపోవడం విస్మయం కలిగిస్తోంది.

నిర్లక్ష్యం వీడాలి

రాష్ట్రంలో ఏకైక బ్లూ ఫ్లాగ్ బీచ్‌ను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా, తక్షణమే ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించి, బీచ్ అభివృద్ధికి కృషి చేయాలని పర్యాటకులు, స్థానికులు కోరుతున్నారు.

దసరా మామూళ్లు ఇవ్వలేదని దాడి

చిట్టినాయుడు కోడి పలావ్ నిర్వాహకులకు తీవ్ర గాయాలు



మద్దిలపాలెం: విశాఖలోని రాంనగర్‌లో దసరా మామూళ్లు ఇవ్వలేదనే కారణంతో హోటల్ నిర్వాహకులపై దాడి జరిగింది. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న చిట్టినాయుడు కోడి పలావ్ దుకాణాన్ని నడుపుతున్న అబ్బిరెడ్డి నరేంద్ర, అతని సోదరుడు మణికంఠపై ఈ దాడి జరిగింది. గురువారం ధన కోటి సురేష్, మద్దు హరి, చంద్రాల మహేంద్రతో పాటు మరికొంతమంది వచ్చి దసరా మామూళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిని ప్రశ్నించినందుకు, నిందితులు తీన్‌మార్ కర్రలతో నరేంద్ర, మణికంఠపై దాడికి దిగారు. ఈ దాడిలో నిర్వాహకుల్లో ఒకరికి కుడి కంటికి తీవ్ర గాయం అయ్యింది. బాధితుల ఫిర్యాదు మేరకు త్రీటౌన్ సీఐ పల్లా పైడియ్య ఆదేశాలతో ఎస్ఐ షేక్ షరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వేలం ద్వారానే ప్లాట్ల విక్రయాలు

విశాఖ సిటీ: కాపులుప్పాడ వద్ద అన్ని మౌలిక వసతులు, సదుపాయాలతో నూతనంగా వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో నివాస స్థలాల విక్రయ ప్రక్రియ ప్రారంభమైందని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లేఅవుట్ ఐటీ హిల్స్‌కు, ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన డేటా సెంటర్లకు సమీపంలో ఉండడంతో డిమాండ్ ఉందన్నారు. ఈ అవుట్‌లో ప్లాట్ల విక్రయాలు, కేటాయింపు కేవలం వేలం ద్వారానే జరుగుతుందని తేల్చి చెప్పారు. ఆక్షన్ లేకుండా స్థలాల కేటాయింపు ఉండదని, దీనిని కొనుగోలుదారులు గమనించాలని సూచించారు.

హోరు గాలి.. చెట్లు కూలి



సత్యం జంక్షన్ నుంచి గురుద్వార వైపు వచ్చే హైవేలో బస్సుపై పడిన చెట్టు



డైమండ్ పార్క్ వద్ద నేలకొరిగిన విద్యుత్ స్తంభం



నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాల తొలగింపును పర్యవేక్షిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్



చెట్టును లాగుతున్న పోలీసులు



రామాటాకీస్ ప్రాంతంలో ఇంటిపై ఒరిగిన చెట్టు

డాబాగార్డెన్స్ : నగరంలో గురువారం ఈదురు గాలులు, వాన బీభత్సం సృష్టించాయి. ఈ గాలుల తీవ్రత గతంలో సంభవించిన హుద్‌హుద్ తుఫానును తలపించేలా ఉండడంతో స్థానికులు తీవ్ర భయాందోళన చెందారు. నగరం వ్యాప్తంగా దాదాపు 80 ప్రాంతాల్లో 168 వరకు చెట్లు నేలకూలాయి. దీంతో సాధారణ జనజీవనానికి, వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు జీవీఎంసీ యంత్రాంగం వెంటనే రంగంలోకి దిగింది. ఈ నేపథ్యంలో, జీవీఎంసీ యంత్రాంగం తక్షణమే స్పందించి, ప్రజలు, వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా యుద్ధప్రాతిపదికన తొలగింపు చర్యలు చేపట్టింది. జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ దెబ్బతిన్న ప్రాంతాలను సందర్శించి, అధికారులను అప్రమత్తం చేశారు. వర్షాల ప్రభావంతో నగరంలో 80 ప్రాంతాల్లో చెట్లు పాక్షికంగా, 168 వరకు పూర్తిగా నేలకూలాయని, 2 విద్యుత్ స్తంభాలు పడిపోయాయని కమిషనర్ తెలిపారు. జోనల్ కమిషనర్ల పర్యవేక్షణలో హార్టికల్చర్, మెకానికల్, ప్రజారోగ్య విభాగాలు సంయుక్తంగా పనిచేసి, 62 ప్రాంతాలలో అడ్డుగా ఉన్న వాటిని ఇప్పటికే తొలగించాయి. మిగిలిన చోట్ల కూడా పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. జీవీఎంసీ 8 ప్రత్యేక బృందాలు, 17 జేసీబీల సాయంతో తొలగింపు కార్యక్రమం చేపట్టి, 145 చెట్లను పూర్తి స్థాయిలో తొలగించామన్నారు. . మిగిలిన 23 చెట్లను తొలగించే పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఈదురు గాలులకు 9 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని, వాటిని వెంటనే పునరుద్ధరణ కార్యక్రమం చేపట్టి విద్యుత్‌కు అంతరాయం లేకుండా తగు చర్యలు చేపట్టామన్నారు. కమిషనర్ స్వయంగా బిర్లా జంక్షన్ సర్వీస్ రోడ్డు, సర్క్యూట్ హౌస్ ప్రాంతాల్లో పనులను పర్యవేక్షించారు. ఈదురు గాలుల కారణంగా దెబ్బతిన్న విద్యుత్ సరఫరా వ్యవస్థను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించినట్లు ఏపీఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ ఎస్ఈ శ్యాంబాబు తెలిపారు. వర్షాల ప్రభావంతో నగర పరిధిలోని 3 డివిజన్లలో విద్యుత్ లైన్లపై భారీ వృక్షాలు, కొమ్మలు విరిగిపడటంతో నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. మొత్తం 95కు గాను 39 33కేవీ ఫీడర్లు, 574కు గాను 120 11కేవీ ఫీడర్లు దెబ్బతిన్నాయని తెలిపారు.

న్యూస్‌రీల్

మహిళా ప్రపంచ కప్ మ్యాచ్‌లపై సమీక్ష

విశాఖ స్పోర్ట్స్: విశాఖ వేదికగా జరగనున్న ఐసీసీ మహిళా ప్రపంచ కప్ మ్యాచ్‌ల ఏర్పాట్లపై శుక్రవారం వైఎస్సార్ స్టేడియంలో ఉన్నతాధికారులు సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చితో పాటు ఇతర సీనియర్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఐదు మ్యాచ్‌లు జరగనున్న నేపథ్యంలో వేదికలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించాలని, స్టేడియం అంతటా బలమైన బ్యాకప్ వ్యవస్థలతో కూడిన సమగ్ర విద్యుత్ భద్రతా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. టికెట్ బాక్స్ ఆఫీసుల వద్ద భద్రతను బలోపేతం చేయాలని, పార్కింగ్ క్యూఆర్ కోడ్‌లను ప్రవేశపెట్టాలని, భద్రత కోసం పార్కింగ్ ప్రాంతాల్లో సీసీటీవీ నిఘా ఏర్పాటు చేయాలని పోలీస్ కమిషనర్ బాగ్చి తెలిపారు. ఈ నెల 9, 12, 13, 16, 26 తేదీల్లో మహిళా ప్రపంచ కప్ మ్యాచ్‌లు జరగనున్నాయి. బుక్ మై షో ద్వారా టికెట్లు అందుబాటులో ఉన్నాయి. ఇండియా – ఆస్ట్రేలియా మ్యాచ్‌కు టికెట్ ధర రూ.150, మిగిలిన మ్యాచ్‌లకు టికెట్ ధర రూ. 100, గేట్ 17 వద్ద ఉన్న ఐదు కౌంటర్ల ద్వారా ఆఫ్‌లైన్ టిక్కెట్ల అమ్మకాలు జరపనున్నారని అధికారులు వెల్లడించారు.

ప్రభుత్వ న్యాయవాదిగా సత్యనారాయణ

విశాఖ సిటీ: ప్రభుత్వ న్యాయవాదిగా బి.సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు న్యాయ, శాసన వ్యవహారాల శాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ కోర్టులో ఈయన ఆ హోదాలో మూడేళ్ల పాటు సర్వీసు అందించనున్నారు. ఆయనకు గౌరవ వేతనంగా నెలకు రూ.30 వేలు అందించనున్నారు.

మూడు ఆస్పత్రుల్లో స్కానింగ్ మెషీన్ల అనుమతుల రద్దు

మహారాణిపేట: జిల్లాలో మూడు ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాలలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ మెషిన్ వినియోగ అనుమతులు రద్దయ్యాయి. సదరు ఆస్పత్రులు చేసుకున్న వినతి మేరకు, కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. గాజువాకలోని లక్ష్మీ నర్సింగ్ హోమ్, శ్రీ విద్య స్కాన్ సెంటర్, తగరపువలసలోని తల్లి పిల్లల ఆస్పత్రులలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ మెషిన్ వినియోగ అనుమతులు రద్దు చేసినట్టు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి. జగదీశ్వర రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వైభవం.. అప్పన్న జమ్మివేట ఉత్సవం

- రామాలంకారంలో దర్శనమిచ్చిన అప్పన్న
- శాస్త్రోక్తంగా శమీపూజ
- వర్షం కారణంగా కొండపైనే ఉత్సవం



రామాలంకారంలో అప్పన్న ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి



జమ్మిచెట్టు వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: విజయదశమిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి జమ్మివేట ఉత్సవం వైభవంగా జరిగింది. కొండదిగువ పూలతోటలో జరగాల్సిన ఈ ఉత్సవాన్ని వర్షం కారణంగా సింహగిరిపైనే అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి రామాలంకారం చేసి కల్యాణమండపంలో వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, షోడశోపచార పూజలు, వేద పారాయణాలు, పంచశూక్త పారాయణాలు జరిపారు. నృసింహమండపంలో ఉన్న శమీ వృక్షం చెంత విశేష పూజలు నిర్వహించారు. చెట్టు నుంచి శమీ దళాలను కోసి, స్వామికి సమర్పించారు. విశేష అర్చన అనంతరం ఆలయ బేడామండపంలో స్వామికి తిరువీధి జరిపారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు, అర్చకులు పెద్దరాజు, పవన్ తదితరులు ఉత్సవాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, పూర్వ ఈవో సూర్యకళ ఉత్సవంలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. దేవస్థానం ఈఈ రమణ, ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న సత్య హరిశ్చంద్ర పద్యనాటకం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ – డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రతినెల తొలి నాటిక ప్రదర్శనలలో భాగంగా శుక్రవారం 'శ్రీ సత్య హరిశ్చంద్ర' పద్య నాటకాన్ని ప్రదర్శించారు. పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మ దర్శకత్వంలో ఈ చారిత్రక నాటకం ప్రదర్శించారు. కార్యక్రమాన్ని వీఎండీఏ అధ్యక్షులు ఎం.ఎస్.ఎన్. రాజు, కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు ప్రారంభించారు. నాటకం విజయవంతం కావడంపై అధ్యక్ష కార్యదర్శులు నటులను ఘనంగా సత్కరించారు.

6న కేంద్ర మంత్రి శర్బానంద రాక

సాక్షి, విశాఖపట్నం : కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జల రవాణా శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ విశాఖలో ఈ నెల 6న పర్యటించనున్నారు. షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ)లో నిర్వహించే కార్యక్రమానికి కేంద్ర మంత్రి హాజరుకానున్నారు. పోర్టులోని అవుటర్ హార్బర్‌లో క్రూడాయిల్, పెట్రోలియం ఉత్పత్తుల హ్యాండ్లింగ్ చేసే భారీ నౌకల కోసం నిర్మించిన సింగిల్ మూర్ పాయింట్(ఎస్పీఎం) అభివృద్ధి పనుల్ని కేంద్ర మంత్రి ప్రారంభించనున్నట్లు పోర్టు అధికారులు తెలిపారు. అనంతరం పోర్టులో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఉన్నతాధికారులతో మంత్రి శర్బానంద సమీక్ష నిర్వహించనున్నారని వెల్లడించారు.

గాంధీ మార్గం అనుసరణీయం

జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్



కలెక్టరేట్‌లో గాంధీజీ, ఎల్‌బీ శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: మహాత్మా గాంధీ ఆచరించిన అహింస, శాంతి మార్గాలు మనందరికీ అనుసరణీయమని, ప్రతి ఒక్కరూ ఆయన్ని ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో మహాత్మా గాంధీ విగ్రహానికి గురువారం పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో సత్యం, అహింస ఆయుధాలుగా, శాంతి, సహనం కవచాలుగా చేసుకుని భారత జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు గాంధీజీ అని కొనియాడారు. స్వాతంత్ర్య ఫలాలను పొందుతున్న మనం ఆర్థిక స్వాతంత్ర్యం పొంది ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు.

శాస్త్రి చిరస్మరణీయుడు : జై జవాన్ జై కిసాన్ నినాదాన్ని దేశానికి అందించి, కష్టపడే రైతు, సరిహద్దుల్లో సైనికుడిని సమానంగా గౌరవించిన మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శాస్త్రి చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. సాధారణ జీవనశైలి, నిజాయితీ, దేశం పట్ల అంకితభావం కలిగిన శాస్త్రి చిరస్మరణీయుడన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి బీవీ రాణి, డీపీవో శ్రీనివాసరావు, జీవీఎంసీ, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పడవ బోల్తాపడి మత్స్యకారుడి మృతి



నూకరాజు మృతదేహం

ఆరిలోవ: సముద్రంలో చేపల వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు పడవ బోల్తాపడి మృత్యువాతపడ్డాడు. ఆరిలోవ ఎస్ఐ రాందాస్ తెలిపిన వివరాల మేరకు.. జీవీఎంసీ 9వ వార్డు పరిధి జోడుగుళ్లపాలేనికి చెందిన గరికిన నూకరాజు(36) శుక్రవారం చేపల వేటకు పడవపై బయలుదేరాడు. తిరిగి ఒడ్డుకు చేరుకునే సమయంలో సముద్రంలో ప్రవాహం, అలల తాకిడి అధికంగా ఉండటంతో పడవ బోల్తాపడింది. దీంతో నూకరాజు నీటిలో మునిగిపోయి మరణించాడు. అలలపై తేలియాడుతున్న అతని మృతదేహాన్ని గమనించిన స్థానిక మత్స్యకారులు గరికన నర్సింగ్, అప్పలరాజు ఒడ్డుకు చేర్చారు. మృతుడి తండ్రి గరికిన గురుమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్ మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.


'ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్లమెంట్ వద్ద నిరసన'



ఎంపీ బాబూరావుకు వినతిపత్రం అందిస్తున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలంటూ పార్లమెంట్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహిస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు తెలిపారు. శుక్రవారం ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు నగరంలో ఎంపీను కలిసి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరారు. సొంత గనులు ఉంటేనే ప్లాంట్‌కు భవిష్యత్తు ఉంటుందని, గనుల సాధనకు సహకరించాలని విన్నవించారు. దీనిపై ఎంపీ మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకించామన్నారు. ప్లాంట్‌కు గనులు కేటాయించాలని ఆనాడు తమ పార్టీ కేంద్రాన్ని కోరిన విషయాన్ని గుర్తు చేశారు. ప్లాంట్‌ను రక్షిస్తామని బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదని ఆక్షేపించారు. నవంబర్‌లో జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో తమ ఎంపీలతో కలిసి పార్లమెంట్ ముందు నిరసన ప్రదర్శన చేస్తామన్నారు. ఎంపీను కలిసిన వారిలో పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, సీహెచ్ నర్సింగరావు, మంత్రి రాజశేఖర్‌లు ఉన్నారు.

దేశరక్షణ రంగంలో హెచ్ఎస్ఎల్ కీలక పాత్ర



రక్షణ రంగంలో హెచ్ఎస్ఎల్ పాత్రను వివరిస్తున్న సీఎండీ గిరిదీప్‌సింగ్

సింధియా: హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఆవరణలో జాతిపిత మహాత్మా గాంధీ 156వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి షిప్‌యార్డ్ సీఎండీ గిరిదీప్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శాంతి, అహింస సిద్ధాంతాలతో దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన గాంధీజీ సేవలను ఆయన కొనియాడారు. గాంధీజీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం ఉద్యోగులకు, భాగస్వాములకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మనిర్భర్ భారత్ దిశగా స్వదేశీ నౌకా నిర్మాణం కోసం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమాన్ని నిర్వహించినట్లు, అలాగే అక్టోబర్ 2 నుంచి 31 వరకు 'స్పెషల్ క్యాంపెయిన్ 5.0' ను ప్రారంభిస్తున్నట్లు సీఎండీ వెల్లడించారు.

50 అడుగుల 'రావణ' దహనం



ఇస్కాన్‌లో నిర్వహించిన రావణ దహనం

కొమ్మాది: బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో గురువారం విజయదశమి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ముందుగా 'రామకళామృతం, రామగానామృతం' కీర్తనలు, ఆలాపనలు భక్తిభావంతో నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య ఆకర్షణగా సాయంత్రం 50 అడుగుల భారీ రావణ దిష్టిబొమ్మను దహనం చేసే కార్యక్రమం జరిగింది. రావణ దహనం అనంతరం నిర్వహించిన ఫైర్ క్రాకర్స్ షో , సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీ శ్రీ భరత్, ఇస్కాన్ అధ్యక్షులు సాంబాదాస్ ప్రభుజీ, మాతాజీ నితాయి సేవినీ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు కష్టమే..!

- కూటమి ప్రభుత్వం ఏర్పాటై 16 నెలలైనా కొలిక్కిరాని కొత్త పెన్షన్లు
- ఇప్పటి వరకు ఒకరికి కూడా పెన్షన్ మంజూరు చేయని ప్రభుత్వం
- సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న వికలాంగ, వితంతు, వృద్ధులు
- దరఖాస్తులు తీసుకోవడానికి కూడా అంగీకరించని సచివాలయ సిబ్బంది



మహారాణిపేట: కూటమి సర్కార్ కొలువుదీరి 16 నెలలు కావస్తున్నా.. కొత్త పింఛన్ల ఊసే ఎత్తడం లేదు. ఎన్నికల ముందు 50 ఏళ్లు దాటిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీలకు, వివిధ కేటగిరీలకు చెందిన దివ్యాంగులకు పింఛన్లు ఇస్తామని ఎన్నికల ప్రచార సభల్లో బాకాలు ఊదారు. కానీ ప్రభుత్వం ఏర్పడ్డాక కనీసం దరఖాస్తులు కూడా స్వీకరించే పరిస్థితి లేదని అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌లో ఈ దరఖాస్తులే ఎక్కువంటే అతిశయోక్తి కాదు. ఇంటి సమీపంలో ఉన్న సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా.. ఫలితం కానరావట్లేదని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు వాపోతున్నారు.

దివ్యాంగ పింఛన్లకు ఎసరు

సామాజిక పింఛన్లు తీసుకుంటున్న పలు కేటగిరీల్లోని దివ్యాంగులపై కూటమి సర్కార్ కక్ష గట్టింది. సామాజిక పింఛన్లు తీసుకునేవారిపై ర్యాండప్ సర్వేతో లబ్ధిదారులను తగ్గించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ పేరిట పింఛన్ల ఏరివేతకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో వివిధ కేటగిరీల్లో 1,60,200 మంది పింఛన్లు పొందుతున్నారు. వివిధ రకాలైన దివ్యాంగులు 21,306 మంది ఉన్నారు. వీరికి కేటగిరీ వారీగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు చొప్పున పింఛన్ అందిస్తున్నారు. ఇందులో 16,187 మందికి రీ వెరిఫికేషన్ పూర్తయింది. ఇంకా 5,119 మంది దివ్యాంగులకు రీ వెరిఫికేషన్ చేయాల్సి ఉంది. వీరిలో కొందరు రీ వెరిఫికేషన్‌కు హాజరు కాలేకపోయారు. దీంతో 1,579 మందికి పింఛన్ నిలిపేశారు. ఇందులో తమ పనులు తాము చేసుకోలేని వారు కూడా ఉన్నారు.

గత ప్రభుత్వంలో ఏటా రెండుసార్లు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏడాదికి రెండు సార్లు కొత్త పింఛన్లు ఇచ్చేవారు. గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే సరిపోయేది. చాలా వరకు ఇంటికే వచ్చి వలంటీర్లు దరఖాస్తులు తీసుకునేవారు. ఏటా జనవరి, జూలై నెల్లో అర్హులను ఎంపిక చేసి, ఆ మరుసటి నెల నుంచే పింఛన్ మొత్తం అందించేవారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి 16 నెలలవుతున్నా కొత్తగా ఒక్క పింఛన్ కూడా ఇచ్చిన దాఖలాల్లేవు.

50 ఏళ్లకే పింఛన్ ఏమైంది?

సూపర్–6 హామీల్లో భాగంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని మేనిఫెస్టోలో చేర్చారు. ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు కనిపించట్లేదు. ఇప్పుడు సూపర్ సిక్స్–సూపర్ హిట్ అంటూ కూటమి నేతల హడావుడి ప్రజల్లో నగుబాటుకు గురవుతోంది. కొత్త పింఛన్ కోసం సచివాలయాల్లోకి వెళ్తే 50 ఏళ్ల కేటగిరీపై ఇంకా ఆప్షన్ రాలేదని చెప్పి, సిబ్బంది వెనక్కి పంపుతున్నారు. పింఛన్ల కోసం గతంలో దరఖాస్తులు పెద్ద సంఖ్యలో వచ్చాయి. వాటిని ఇంకా విచారణే చేయలేదు. ఇలాంటి సమయంలో కొత్త దరఖాస్తులు ఎలా స్వీకరించేదంటూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

'దివ్యాంగుల'నేతకే కోత

దివ్యాంగుల హక్కులు, సమస్యలపై పోరాటం చేస్తున్న వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు అక్కిరెడ్డి అప్పారావు పింఛన్‌కే ఎసరెట్టారు. 2003లో విశాఖ విమానాశ్రయ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అప్పారావు తీవ్రంగా గాయపడ్డారు. ఎడమ కాలు దెబ్బతినడంతో మోకాలి వరకు తొలగించారు. ఈ నేపథ్యంలో అప్పారావుకు 60 శాతంతో సదరం సర్టిఫికెట్ జారీ చేశారు. మొత్తం మూడుసార్లు సదరం సర్టిఫికెట్ తీసుకున్నారు. ఇప్పుడు పింఛన్ నిలుపుదల నోటీసు జారీ చేశారు. ఇది చాలా అన్యాయమని, దివ్యాంగుల సంక్షేమం కోసం పాటుపడుతున్న తన పింఛన్ తొలగింపుపై అధికార యంత్రాంగం స్పందించాలని అప్పారావు కోరుతున్నారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం చైర్‌పర్సన్ జె. సుభద్ర అధ్యక్షతన స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో జరగనుంది. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుంది. దీనిలో 9 అంశాలపై చర్చించనున్నారు. జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని, ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపీపీలు తప్పకుండా పాల్గొనాలని జడ్పీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి. నారాయణమూర్తి కోరారు.

కెరటాల్లో చిక్కుకున్న యువకుడిని రక్షించిన లైఫ్‌గార్డులు

విశాఖ సిటీ: ఆర్‌కే బీచ్ వద్ద సముద్ర కెరటాల్లో చిక్కుకున్న యువకుడిని లైఫ్‌గార్డు శుక్రవారం రక్షించాడు. వేపగుంట ప్రాంతానికి చెందిన గొల్లవెల్లి తేజ(21) మరో ఏడుగురు స్నేహితులు డాక్‌యార్డ్‌లోని విజయలక్ష్మి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పనిచేస్తున్నారు. వీరు శుక్రవారం మధ్యాహ్నం 3.30కు ఆర్‌కే బీచ్ సందర్శనకు వచ్చారు. కార్ పార్కింగ్ ఎదురుగా స్నానానికి దిగారు. అందులో తేజను సముద్ర కెరటాలు లోపలికి లాక్కెళ్లాయి. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న మెరైన్ స్టేషన్ హోంగార్డు సతీష్, లైఫ్‌గార్డ్ సురేష్‌లు వెంటనే స్పందించి కెరటాల్లో కొట్టుకుపోతున్న తేజను ఒడ్డుకు తీసుకొచ్చారు. అక్కడే ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం అంబులెన్సులో కేజీహెచ్‌కు తరలించారు.

వివాహితను వేధిస్తున్న వ్యక్తి అరెస్ట్

విశాఖ సిటీ: వాట్సాప్ ద్వారా వివాహితను వేధిస్తున్న వ్యక్తిని సైబర్ క్రైమ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నగరానికి చెందిన వివాహితతో భీమిలికి చెందిన మోహన్‌కుమార్‌కు పరిచయం ఉంది. గతంలో ఆమెతో కలిసి తీసుకున్న ఫోటోలను ఆమె భర్తకు వర్చువల్ ఫోన్‌నెంబర్‌తో వాట్సాప్ ద్వారా పంపించి బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆమె సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతికత ఆధారంగా భీమిలికి చెందిన మోహన్‌కుమార్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

ఆరిలోవ: స్థానికంగా ఆత్మహత్యకు పాల్పడిన ఓ బాలిక చికిత్స పొందుతూ మరణించింది. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలు.. మహ్మద్ సర్ఫ్‌రాజ్ బీహార్ నుంచి కుటుంబంతో వచ్చి ఆరిలోవ ప్రగతి నగర్‌లో నివాసం ఉంటున్నాడు. అతని కుమార్తె(14) ఆరు నెలలుగా 21 ఏళ్ల కుర్రాడితో ప్రేమలో పడింది. తండ్రి ఇటీవల కుమార్తెను మందలించాడు. దీంతో గత నెల 28న ఇంట్లో ఆమె ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి కొన ఊపిరితో ఉన్న బాలికను కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం బాలిక మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'అండమాన్ చూద్దాం రండి' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

మద్దిలపాలెం: అండమాన్ వెళ్లేందుకు గతంలో మాదిరి భయపడాల్సిన పనిలేదని, ఇప్పుడది చాలా మంచి సందర్శన స్థలమని పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. ప్రజ్ఞశ్రీ డాక్టర్ బండి సత్యనారాయణ రచించిన అండమాన్ చూద్దాం రండి(యాత్రా కథనం) పుస్తకాన్ని ఏయూలో గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాత్రా రచనల ప్రయోజనాలను వివరించారు. తాను పాకిస్థాన్‌పై రాసిన యాత్రా రచనను సభ ముందుంచారు. కేంద్ర సాహిత్య అకాడమీ బాల పురస్కార గ్రహీత(పార్వతీపురం) నారంశెట్టి ఉమామహేశ్వరరావు పుస్తక పరామర్శ చేస్తూ, పుస్తకం నోరు తెరవని ఉపన్యాసకుడని, పుస్తకాలు నేస్తాలని అభివర్ణించారు. ఈ పుస్తకం చదివిన తరువాత అండమాన్ వెళ్లాలని ఆరాటం కలుగుతోందన్నారు. గౌరవ అతిథి సెంట్రల్ ఎక్సైజ్ అధికారి నల్లా అపర్ణ మాట్లాడుతూ తన భర్త సుబ్బారావు అండమాన్‌లో పనిచేస్తున్నారని, ఇలాంటి సమయంలో అండమాన్ చూద్దాం రండి పుస్తకాన్ని సత్యనారాయణ రాయడం ఆనందంగా అన్నారు. రచయిత బండి సత్యనారాయణ స్పందిస్తూ ఈ పుస్తక రచనకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు, యార్లగడ్డ అందించిన ప్రోత్సాహానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మస్తాన్ రెడ్డి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో తొలి పుస్తకాన్ని దూరదర్శన్ డెప్యూటీ డైరెక్టర్ జనరల్ సి.సుబ్బారావు స్వీకరించారు. మార్టూరు శ్రీనివాసరావు, ఉప్పల అప్పలరాజు, డా.కేవీఎస్ హనుమంతరావు, సీహెచ్ చిన సూర్యనారాయణ, మరడాన సుబ్బారావు, స్వర్ణ శైలజ, పీఎల్‌వీ ప్రసాద్, శీరేల సన్యాసిరావు పాల్గొన్నారు.

దసరా పండగ వేళ విషాదం

- విద్యుత్ వైర్లు తెగిపడి టీ బడ్డీ నిర్వాహకుడి మృతి
- టీ తాగేందుకు వచ్చిన మరొకరికి గాయాలు



మృతుడు బత్తిన ఈశ్వరరావు

కంచరపాలెం: దసరా పండగ వేళ చిరు వ్యాపారి కుటుంబంలో విషాదం నెలకొంది. విద్యుత్ హై టెన్షన్ వైర్లు తెగిపడి చిరువ్యాపారి దుర్మరణం చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం జరిగిన సంఘటన వివరాలివి. కంచరపాలెం నేతాజీ కూడలి ఫ్లైఓవర్ వంతెన సమీపంలోని ముత్యాలమ్మ ఆలయం పక్క రోడ్డులో బత్తిన ఈశ్వరరావు(52) టీ బడ్డీ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. గురువారం కురిసిన కుండపోత వర్షంతో పాటు ఒక్కసారిగా ఈదురు గాలులు రావడంతో టీ దుకాణంపై హైటెన్షన్ వైర్లు తెగి, సర్వీస్ వైర్లపై పడ్డాయి. ఆపై అవి బడ్డీపై వాలాయి. అదే సమయంలో దసరా పురస్కరించుకుని మామిడి కొమ్మలు ఐరన్ బడ్డీకి అలంకరణ చేస్తున్న ఈశ్వరరావు విద్యుత్ షాక్‌కు గురై దుర్మరణం చెందారు. అదే సమయంలో బడ్డీ వద్దకు టీ తాగేందుకు వచ్చిన మామిడి తులసీరావు కూడా విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక, విద్యుత్, పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఈశ్వరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. పండగ పూట జరిగిన ఈ సంఘటన గాంధీనగర్ ప్రజల్లో విషాదం నింపింది. సీఐ కె.రవికుమార్ నేతృత్వంలో కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. జోన్–5 కమిషనర్ రాము, ఏపీఈపీడీసీఎల్ కంచరపాలెం జోన్ ఈఈ బీకే నాయుడు వైర్ల పునరుద్ధరణ పనులు పర్యవేక్షించారు.

నేడు పాలిటెక్నిక్ కాలేజీలో మెగా జాబ్‌మేళా

మురళీనగర్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రాంగణంలో శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాలో మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్, డబ్ల్యూఎన్ఎస్, వీఎక్స్ గ్లోబల్ సొల్యూషన్స్, కోజెంట్, ఎస్ఎన్ఎఫ్ ఇండియా ప్రై.లి., పిట్టి ఇంజినీరింగ్ లిమిటెడ్, డెక్కన్ ఫైనాన్స్ కెమికల్ ఇండియా ప్రై.లి., అపోలో ఫార్మసీ లిమిటెడ్, అపోలో హోమ్‌కేర్ లిమిటెడ్, ఇన్నోవ్ సోర్స్ (డిమార్ట్/అమెజాన్/స్విగ్గీ), పేటీఎం కంపెనీలు పాల్గొని ఉద్యోగాల నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. మెగా ఉద్యోగ మేళాలో వెయ్యికి పైగా ఉద్యోగాలకు అర్హుల్ని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లమో, బీటెక్, ఏదైనా డిగ్రీ, బీఎస్సీ నర్సింగ్ అర్హత కలిగిన వారు శనివారం ఉదయం 9 గంటలకు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు, జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. వివరాలకు నైపుణ్యం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూసుకుని, రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఆధార్ లింక్డ్ ఫోన్ నంబరు తప్పనిసరని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9948768778లో సంప్రదించవచ్చన్నారు.